నాయకులకు దివాకర్‌రావు పరామర్శ

వంగ తిరుపతిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 17 : నస్పూర్‌కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వంగ తిరుపతి, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మంగళవారం వారి ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, పార్టీ పట్టణ కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, కౌన్సిలర్లు కుర్మిళ్ల అన్నపూర్ణ, జబీన్ హైమద్, నాయకులు కాటం రాజు, గర్శె భీమయ్య, పెరుమాళ్ల జనార్దన్, ముక్కెర వెంకటేశ్ ఉన్నారు.

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 17 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు బర్సా పోచయ్య, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జాబురే రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకన్న, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ జలింషా, హైమద్, భీంరావ్, బండి సాయి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విమోచన దినం

కాగజ్‌నగర్ : జెండా ఎగురవేస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబు

కాగజ్‌నగర్/కన్నెపల్లి/చెన్నూర్/కాసిపేట/మంచిర్యాల(ఏసీసీ), సెప్టెంబర్ 17 : రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర విమోచన దినోత్సవం జరుపాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. పట్టణంలోని ఆయన నివాసం, సర్‌సిల్క్, రాజీవ్ గాంధీ చౌరస్తాలో విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే మంచిర్యాలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్.., కన్నెపల్లి, భీమిని, చెన్నూర్, కాసిపేట మండలాల్లోని తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, దవాఖానలలు, పంచాయతీ కార్యాలయాలోల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎష్ఐలు, సీఐలు, వైద్యులు జాతీయ జెండాలనె ఎగురవేశారు.

సకాలంలో పౌష్టికాహారం అందించాలి

నస్పూర్, సెప్టెంబరు 17 : అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సీడీపీవోలతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషణ్ అభియాన్ కింద మంచి ఆహారం అందించాలని సూచించారు. పిల్లల శారీరక ఎదుగుదలను పర్యవేక్షిస్తుండాలన్నారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పిల్లలను క్రమ తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సంక్షేమాధికారి స్వరూపరాణి, సమన్వయకర్త రజిత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-AII

CHANGE OF NAME
R.N.I. No. TELMUL/2016/73158
HSE No. 1051/2023-2025.
I, PERAKA DEVAMMA W/o. PERAKA SHANKARAIAH, Housewife, shall henceforth be known as PERAKA DEVIKA.
Naspur 20-08-2024
PERAKA DEVAMMA

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

మంచిర్యాల అర్బన్ : జెండా ఎగురవేస్తున్న డీసీపీ భాస్కర్

హాజీపూర్ : జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ దీపక్ కుమార్

చెన్నూర్ టౌన్ : ఎంపీడీవో కార్యాలయంలో డీపీవో వెంకటేశ్వర్లు

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 17 : ప్రజా పాలన దినోత్సవాన్ని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేసి, జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా డీసీపీ, మున్సిపల్, తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, సహకార సంఘం, పంచాయతీ, ఎమ్మార్సీ, వైద్యశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెటాలియన్‌లో కమాండెంట్ వెంకట్రాములు, జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్, జడ్పీ కార్యాలయంలో జడ్పీటీసీవో గణపతి, చెన్నూర్‌లో డీపీవో వెంకటేశ్వర్ రావు, జిల్లా అధికారులు, మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 17 : జిల్లాలో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని చోట్లా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే పూజా కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని చోట్ల వీరబ్రహ్మేంద్ర స్వామి, విశ్వకర్మ చిత్రపటాలకు పూజలు చేశారు. పంచశీల జెండాలను ఆవిష్కరించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు జెండా ఎగురవేశారు. మందమర్రి పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుంచి మార్కెట్, రామన్ కాలనీ, విద్యానగర్‌ల మీదుగా స్థానిక పాత బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. శ్రీరాంపూర్‌లోని సింగరేణి గనులపైనా విశ్వకర్మ జయంతి నిర్వహించారు.

దహెగాం : మండల కేంద్రంలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న భక్తులు

మందమర్రి : పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

విఘ్నేశ్వరుడికి వీడ్కోలు..

మంచిర్యాల అర్బన్ : మంచిర్యాలలో యువకుల నృత్యం

మంచిర్యాల అర్బన్/కాగజ్‌నగర్/వాంకిడి/చింతలమానేపల్లి, సెప్టెంబర్ 17 : పదకొండు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు, కాగజ్‌నగర్ పట్టణం, వాంకిడి, చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ, కర్జెల్లి, ఆయా గ్రామాల్లో మంగళవారం ఉదయం గణపతికి పుజలు చేసిన అనంతరం నిమజ్జన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్యాండు మేళాలు, డీజే చప్పుళ్లు, కోలాట నృత్య ప్రదర్శనలు, భాజాభజంత్రీల నడుమ చిన్నాపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. మంచిర్యాలకు చెందిన వినాయకులను మంచిర్యాల, ఇందారం, గూడెం గోదావరిలో.., కాగజ్‌నగర్ వినాయకులను పెద్దవాగులో నిమజ్జనం చేశారు. మంచిర్యాల విశ్వనాథ స్వామి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, ఆయా చోట్ల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకులు విజిత్ రావు.., కాగజ్‌నగర్ పట్టణంలోని లారీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా పూజలు చేశారు. పెట్రోల్ పంపు ఏరియాలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక టెంట్‌లు ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం, జ్యూస్, స్వీట్లు పంపిణీ చేశారు. మంచిర్యాలలో రామగుండం సీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో డీసీపీ భాస్కర్ బందోబస్తు నిమిత్తం హాజరైన 200 మంది పోలీసు సిబ్బందికి పట్టణ పోలీస్ స్టేషన్‌లో తగు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ కమాండ్ కంట్రోల్‌లో సీసీ కెమెరాల్లో పరిశీలించారు. ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, తాండూర్ సీఐ కుమారస్వామి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగజ్‌నగర్‌లో కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్ వాస రావు ఆదేశాలతో కాగజ్‌నగర్ డీఎస్పీ రామనుజం ఆధ్వర్యంలో పట్టణ సీఐ శంకరయ్య, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

కాగజ్‌నగర్ : పూజల్లో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

నీటి వసతి కల్పించని అధికారులు..

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 17 : పెద్దవాగులో కావాల్సినంత నీటి వసతి కల్పించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. సరిపడా నీరు లేకపోవడంతో ప్రతిమలు మునగలేదని వాపోతున్నారు. లక్షలు వెచ్చించి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు.. జిల్లా కేంద్రంలోని అడ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేస్తే కావాల్సినంత నీరు ఉండేదని, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా నిత్యం ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను అప్రమత్తం చేసినా ఉదాసీనత స్పష్టంగా కనిపించలేదని అంటున్నారు.

లక్కీ డ్రాలో కారు..

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 17 : జిల్లా కేంద్రంలోని బజార్వాడి సంఘసేవక గణేశ్ మండలి వద్ద ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో గోలేటికి చెందిన ప్రశాంత్.. కారును గెలుచుకున్నాడు. టోకెన్ నంబర్ 941 విజేతగా నిలిచాడు. కమిటీ సభ్యులు అభినందించి, కార్ కీ అందజేశారు.

మంచిర్యాల అర్బన్ : జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

కాగజ్‌నగర్ : ప్రసాదం, జ్యూస్ పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్ : నీట మునగని గణనాథులు

స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 17 : మున్సిపాలిటీలో అక్టోబర్ 2 వరకు చేపట్టనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి సంబంధించి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతీప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, ఎంఈ మసూద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 17 : విలేజ్ నస్పూర్‌లోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. మానవహారం చేపట్టారు. అనంతరం 15వ వార్డులో తడి–పొడి చెత్తపై మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత మల్లేశ్, కమిషనర్ చిట్యాల సతీశ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రశాంత్, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషణపై అవగాహన

తాండూర్, సెప్టెంబర్ 17 : మండలంలోని మాదారం, తాండూర్ సెక్టార్లలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాస సంబురాలు కొనసాగుతున్నాయి. అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఆర్ లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం బాలామృతం, ఆరోగ్యంపై కార్యక్రమాలు నిర్వహించగా, సూపర్‌వైజర్ స్వరూపారాణి అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం మల్లయ్య, ఆయా, తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు, పిల్లలున్నారు.

దండేపల్లి, సెప్టెంబర్17 : దండేపల్లి మండలం చింతపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో లక్షెట్టిపేట సీడీపీవో రేష్మ పౌష్టికాహార ప్రాముఖ్యత, పిల్లలకు ఇవ్వాల్సిన అనుబంధ పోషకాహారం గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలున్నారు.

అమరవీరులకు నివాళి..

చెన్నూర్, సెప్టెంబర్ 17 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవాల సందర్భంగా చెన్నూర్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, నాయకులు మిట్టపల్లి పౌల్, బడికెల మధునయ్య, శంకర్, సుంకరి చందు, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి, సెప్టెంబర్17 : మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పెర్క రాజేశ్ జెండా ఎగురవేశారు. జిల్లా నాయకులు మేదరి దేవవరం, దుర్గం లింగన్న, భానుచందర్, కేతిరెడ్డి రమణారెడ్డి, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 17 : పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో పార్టీ సీనియర్ నాయకుడు దుర్గం దేవన్న పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి దేవవరం, సహాయ కార్యదర్శి రమణారెడ్డి, భానుచందర్, రవికిరణ్, రామన్న తదితరులున్నారు.

కాసిపేట, సెప్టెంబర్ 17 : సీపీఐ జిల్లా కార్యదర్శి దాగం మల్లేశ్ ఆధ్వర్యంలో కాసిపేట మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి జాడి పోచం, పులి శంకర్, దాగం రాయలింగు, దుర్గం పోశం, గోదారి లింగమూర్తి, బండారి సత్తయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మొరం తరలింపు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 17 : ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ఇటిక్యాల చెరువులో రియల్టర్లు అక్రమంగా పోసిన మొరాన్ని మంగళవారం మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులకు తరలించారు. వారం క్రితం ఇటిక్యాల, లక్షెట్టిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మొరం పోస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు అప్పగించారు. సిబ్బంది ఆ మొరాన్ని రోడ్ల మరమ్మతులకు ఉపయోగించారు. కాగా, అక్కడి పట్టాదారులు మొరం తరలింపును అడ్డుకున్నారు. చెరువుపై వస్తున్న ఆరోపణలు పూర్తయ్యేదాకా తరలించవద్దని చెప్పడంతో అధికారులు నిలిపివేశారు. ఇరిగేషన్ ఏఈఈ గౌతం మాట్లాడుతూ.. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేసి, స్టంచ్ వేస్తామని, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల సర్వేనంబర్ల ప్రకారం ముందుగా నోటీసులు జారీ చేస్తామన్నారు.

ఒకరికి ఐదేళ్ల జైలు

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 17 : మైనర్ బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన మండలంలోని దిందా గ్రామానికి చెందిన దుర్వ భాస్కర్‌కు ఫోక్సో కేసులో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.12వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిలాల సెషన్ కోర్టు ప్రధాన న్యామూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2020, నవంబర్ 3న దిందా గ్రామానికి చెందిన ఓ బాలికపై భాస్కర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. అశ్లీల చిత్రాలు చూపించడంతో ఆ బాలికల భయపడి తల్లిదండ్రులకు చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపర్చగా, పీపీ జీవీ ఎస్ ప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువుకావడంతో భాస్కర్‌కు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. శిక్షపడేలా కృషిచేసిన ప్రస్తుత కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ఎం రమేశ్, ఎస్ఐ నరేశ్, కోర్టు కాగజ్‌నగర్ డివిజన్ లైజన్ ఆఫీసర్ బాబాజీ, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసులు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

కోటపల్లి, సెప్టెంబర్ 17 : కొల్లూరు సమీపంలోని గోదావరి తీరంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న సర్దార్ సుఖేశ్, రంగు శ్రీనివాస్, ఆత్కూరి నరేశ్, నిట్టేరి సంతోష్, తాడూరి సమ్మాగౌడ్, జంగం వెంకటేశ్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. వారి నుంచి రూ.9,610, ఐదు మొబైల్ ఫోనుల, మూడు బైకులు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

జాతీయ జెండాకు అవమానం

6:36 గంటల తర్వాత కూడా ఎగురుతున్న జెండా

భీమారం, సెప్టెంబర్ 18 : జాతీయ జెండాను భీమారం కాంగ్రెస్ నాయకులు అవమానపరిచారు. మంగళవారం ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు కొత్త పల్లి మోహన్ రెడ్డితో పాటు, నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. అంతాబాగానే ఉన్నా సాయంత్రానికి జెండాను తీయాలి. కానీ, కాంగ్రెస్ నాయకులు సాయంత్రం 6:36 గంటల వరకు జెండాను అలాగే ఉంచారు. దీంతో స్థానికులు కాంగ్రెస్ నాయకులపై మండిపడుతున్నారు. కాంగ్రెస్‌లో వర్గాలతో రెండు మూడు జెండాలను ఎగురవేసి, వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఒకరిపై కత్తితో దాడి.. పోలీసు కేసు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 17 : వినాయకుడి మండపం వద్ద జరిగిన గొడవలో ఓ వ్యక్తిని కత్తితో పొడిచిన ఘటన సోమవారం రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని హన్మాన్‌బస్తీలో చోటు చేసుకున్నది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హన్మాన్‌బస్తీలో ఏర్పాటు చేసిన ఓ వినాయక మండపం వద్దకు రాంనగర్‌బస్తీకి చెందిన వేల్పుల శ్రావణ్ తన స్నేహితులతో కలిసి వచ్చాడు. వినాయకుడి దర్శనం చేసుకున్న తర్వాత కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్తుండగా, హన్మాన్‌బస్తీకి చెందిన రాసబత్తుల గణేశ్ అడ్డుకున్నాడు. ఇతర బస్తీ నుంచి తమ మండపం వద్ద కొబ్బరికాయ ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించాడు. ఒకరికొకరికి మాటామాటా పెరిగి వాగ్వాదం జరిగింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని శ్రావణ్ వెళ్తుండగా, గణేశ్ అడ్డుకొని కత్తితో దాడికి పాల్పడ్డాడు. చెంపపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'మహాలక్ష్మి' పత్రాల అందజేత

నెన్నెల, సెప్టెంబర్ 17 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 'మహాలక్ష్మి' లబ్ధిదారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం మంజూరు పత్రాలను అందజేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దేవేందర్, ఏపీఎం విజయలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, నాయకులు గట్టు మల్లేశ్, బొమ్మెన హరీశ్‌గౌడ్, గట్టు బానేశ్, మల్లాగౌడ్, శివలింగయ్య, మోహిద్‌ఖాన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్, సెప్టెంబర్ 17 : తాండూర్ కేజీబీవీలో ఖాళీగా ఉన్న స్వీపర్, డే వాచ్ విమెన్ 1 పోస్టుల భర్తీకి స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండి, స్వీపర్ పోస్టు కోసం ఏడోతరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని, డే వాచ్ విమెన్ కోసం పదో తరగతి పాస్ అయినవారు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత పత్రాలతో 24న సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తులను మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించాలని సూచించారు.

సీతారాం ఏచూరికి నివాళి..

కాసిపేట, సెప్టెంబర్ 17 : సోమగూడెం క్రీడా మైదానంలో మంగళవారం వాకర్స్ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోగే పోశం, రవళి, సంకె రవి, మద్దెల భానేశ్, రాజేందర్, అంజన్న, శంకర్, రాజలింగు, రాంచందర్, మనీశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

హాజీపూర్, సెప్టెంబర్ 17 : నంనూర్ పునరావాస కాలనీలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ గణేశ్ మండలి వద్ద సోమవారం నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలకు మంగళవారం హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్, కార్యదర్శి సంధ్య బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా సైకిల్‌ను మేరుగు సమీక్ష.., ద్వితీయ బహుమతిగా 5 లీటర్ల ప్రెషర్ కుక్కర్‌తో పాటు హాట్ బాక్స్‌ను ఉడే రాజ్‌కుమార్.., తృతీయ బహుమతిగా టీ ప్లాస్క్‌తో పాటు, టీ కప్స్‌ను సాయి కుమార్ అందుకున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 17 : నిబంధనలు అతిక్రమించడమే కాకుండా అడ్డుకున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన గొల్ల సంపత్, అక్షిత్, చెన్నూరి రవి, బొజ్జ వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సుభాష్‌నగర్‌లోని ఓ వినాయక మండపం నుంచి యువకులు సోమవారం రాత్రి డిజే సౌండ్‌తో నిమజ్జన శోభాయాత్రగా నిర్వహించారు. సమాచారం మేరకు టూటౌన్ ఎస్ఐ మహేందర్, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి అక్కడికి వెళ్లి, డీజే అనుమతి లేదని, బంద్ చేయాలని వారికి సూచించారు. దీంతో యువకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఆవేశంతో గొల్ల సంపత్, అక్షిత్, చెన్నూరి రవి, బొజ్జ వెంకటేశ్ పోలీసులతో అమర్యాదగా మాట్లాడడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఒకరి ఆత్మహత్య

దండేపల్లి, సెప్టెంబర్ 17 : దండేపల్లి మండలం చింతపెల్లి గ్రామానికి చెందిన చెల్ల సత్యం(47) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. సత్యం తల్లి ఏడాది క్రితం చనిపోయింది. అప్పటి నుంచి సత్యం, భార్య మమత, ముగ్గురు కొడుకులతో శ్రీరాంపూర్‌లో ఉంటున్నారు. ఇద్దరి మధ్య తరుచూ మనస్పర్థలు ఏర్పడేవి. గొడవలు జరుగుతుండేవి. తల్లి చనిపోవడం జీర్ణించుకోలేక, హైబీపీ, గొడవలతో విరక్తి చెంది, మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సత్యం చింతపెల్లి వెళ్లి వస్తానని చెప్పి బయల్దేరాడు. అనంతరం భార్యకు ఫోన్ చేసి, చనిపోతున్నానని చెప్పాడు. భార్య ఎంత బతిమిలాడినా వినిపించుకోకుండా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు

హాజీపూర్, సెప్టెంబర్ 17 : హాజీపూర్ మండలంలోని టీకన్నపల్లి గ్రామానికి చెందిన తీర్థాల తిరుపతిపై అతని బాబాయి కుటుంబ సభ్యులు దాడి చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపతి సురేశ్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకాం.. తిరుపతి, అతడి బాబాయి శంకరయ్య మధ్య భూముల విషయమై, గొడవలు జరుగుతున్నాయి. కాగా, సోమవారం రాత్రి శంకరయ్య, భార్య పద్మ, అతని కూతురు సుఖవాసి దీప్తి, సింగతి మురళీ కృష్ణ, కాంద్రపు రాజయ్య.. తిరుపతి ఇంట్లో చొరబడి అతని భార్య మమత, తల్లి, కూతురుపై దాడి చేశారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 17 : విద్యార్థి దశ నుంచే చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. లక్ష్యం ఎంచుకొని సాధన కోసం కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాబోర్ట్ కిరణ్, ఏజీపీ సత్యం, న్యాయవాదులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవాస్ యోజన 2వ విడుత పథకం ప్రారంభం

ఆసిఫాబాద్ టౌన్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 17: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2వ విడుత పథకాన్ని దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ఇతర ప్రముఖులతో కలిసి ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా హౌసింగ్ నోడల్ అధికారి పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ తో కలిసి హాజరయ్యారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలు, ఆర్థికంగా వెనకబడిన వారికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోటి గృహాలను అందించేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆస్తులు కాపాడాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 17: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శేబ్బీర్ హుస్సేన్ మంగళవారం జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాగజ్‌నగర్‌లోని 8వ వార్డులోని ధోబిఘాట్ ఆక్రమణకు గురైందని, ఓ వ్యాపారీ నకిలీ పత్రాలు సృష్టించి ధోబిఘాట్ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని అట్టి నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేసి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌సిల్క్ డంప్ యార్డు సైతం ఆక్రమణకు గురైందని, విచారణ జరిపించి కాపాడాలని కోరారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి కాపాడాలని విన్నవించారు.

ఉద్యోగుల ప్రయోజనం కోసమే మేళా

రెబ్బెన, సెప్టెంబర్ 17: సింగరేణిలో ఒప్పంద ఉద్యోగుల ప్రయోజనం కోసమే ఇటీవల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేసుకున్నట్లు బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్ ఓపెనింగ్ మేళాను ప్రారంభించారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.30లక్షల వరకు బీమా సౌకర్యం, జీరో బ్యాలెన్స్ అకౌంట్ వంటి వివిధ రకాల ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్, హెడీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి ప్రవీణ్ పలువురు ఉన్నారు.

వరద బాధితులకు సాయం వద్దు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 17 : సింగరేణి కార్మికుల వేతనాల నుంచి వరద బాధితులకు ఆర్థిక సాయం చేయవద్దని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లోని వరద బాధితులకు సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి సాయం అందించాలని కోరారు. ఈ మేరకు శ్రీరాంపూర్ ఆర్కే 7 మేనేజర్ తిరుపతికి మంగళవారం పిట్ కార్యదర్శి సదిరం రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. గనులు, ఓసీపీలపై సహాయ విరాళాల బాక్సులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాటిలో ఎవరికి తోచిన సాయం వారు అందజేస్తారని తెలిపారు. తెలంగాణలోని ఎమ్మెల్యేలు వారి ఒక్క నెల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు చెవుల శ్రీనివాస్, మల్లేశ్, రాజ్‌కుమార్, శివశంకర్, కనుకయ్య, ఆరెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.